సాక్షి కామారెడ్డి

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



'నేరాల నియంత్రణలో..

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు.

- 10లో ▸



పరిసరాల పరిశుభ్రతతో..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు ప్రజలకు సూచించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం

31.5 /22.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'రూ. 938 చెల్లిస్తే విద్యుత్ మీటర్లు బిగిస్తాం'



కామారెడ్డి అర్బన్ : గృహ విద్యుత్‌కు సంబంధించిన మీటర్లు లేనివారు రూ. 938 చెల్లిస్తే వెంటనే కొత్త మీటర్లు బిగిస్తామని ఎస్ఈ రమేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం రామేశ్వర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల నుంచి మీటర్లకు సంబంధించిన దరఖాస్తులు తీసుకున్నారు. విద్యుత్ మీటర్లు లేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈ కల్యాణ్ చక్రవర్తి, రూరల్ ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్ శ్రీనివాస్, లైన్‌మన్ అనిల్ పాల్గొన్నారు.

'వరుణుడు కరుణించాడు'



బీబీపేట : వరుణుడు కరుణించడంతో రైతులకు చాలా మేలు జరిగిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం బీబీపేట పెద్ద చెరువులో అధికారులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకుంటామన్నారు. పంట రుణం మాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తోందన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటే ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదని విమర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుతారి రమేశ్, మాజీ సర్పంచ్ పాత రాజు, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, భూమాగౌడ్ తదితరులున్నారు.

టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



రామారెడ్డి: రెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బిందు టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ సాయి మౌర్య తెలిపారు. ఇటీవల ఆర్మూర్‌లో జరిగిన పోటీలలో సత్తా చాటడంతో ఆమెను ఎంపిక చేశారన్నారు. ఈనెల 28 నుంచి జమ్మూకశ్మీర్‌లో నిర్వహించే సబ్ జూనియర్ జాతీయ స్థాయి టెన్నికాయిట్ టోర్నీలో బిందు పాల్గొంటుందని పేర్కొన్నారు. బిందును పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

కొత్తపల్లిలో పిడుగుపాటు

మాక్లూర్: కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పాటు పిడుగు పడింది. దీంతో పది ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. వీధి లైట్లు దెబ్బతిన్నాయి. పంచాయతీ కార్యదర్శి సాగర్ శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటించి నష్టం వివరాలను సేకరించారు. ఈ వివరాలను తహసీల్దార్‌కు పంపుతానని పేర్కొన్నారు.

గృహజ్యోతి వెలుగులు

- జిల్లాలో లక్షన్నర కుటుంబాలకు మేలు
- ఆరు నెలల్లో రూ. 26.90 కోట్ల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- అందనివారిలో అసంతృప్తి



నెల	కనెక్షన్లు	అర్హులని తేల్చినది	జీరో బిల్లులు	సబ్సిడీ మొత్తం (రూ.లలో)
మార్చి	2,37,709	1,42,303	1,40,306	3,43,36,459
ఏప్రిల్	2,38,663	1,42,312	1,37,821	4,25,52,195
మే	2,39,191	1,42,317	1,36,115	4,43,40,867
జూన్	2,39,761	1,53,047	1,44,931	5,04,57,147
జూలై	2,40,232	1,54,655	1,50,001	4,84,27,232
ఆగస్టు	2,40,778	1,60,791	1,57,637	4,89,54,996

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: గృహజ్యోతి పథకంతో జిల్లాలో సుమారు లక్షన్నర కుటుంబాలకు మేలు జరుగుతోంది. ఆరు నెలల్లో రూ. 26.90 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.

రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే గృహాలకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా కరెంటు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరుతో గ్రామ/వార్డు సభలు నిర్వహించింది. అన్ని గ్రామాలు, పట్టణాల్లో దరఖాస్తులు స్వీకరించారు. రేషన్‌కార్డు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు.. అర్హులను గుర్తించి మార్చి నెలనుంచి పథకాన్ని అమలు చేశారు. ఆరు నెలలుగా పథకం అమలవుతోంది. జిల్లాలో 2.40 లక్షల మంది కేటగిరీ–1 వినియోగదారులు ఉండగా.. ఆగస్టులో 1.57 లక్షల మందికి జీరో బిల్లు వచ్చింది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో చాలా కుటుంబాలు కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు వాడడంతో వారిలో కొంతమందికి 2 వందల యూనిట్లు దాటాయి. దీంతో వారికి గృహజ్యోతి లబ్ధి చేకూరలేదు. వానలు మొదలయ్యాక కరెంటు వాడకం తగ్గడంతో ఎక్కువ కుటుంబాలకు జీరో బిల్లు వస్తోంది.

పథకం వర్తించని వారిలో ఆవేదన..

జీరోబిల్లు అవకాశం రాని వారు ఆవేదన చెందుతున్నారు. గృహజ్యోతి పథకం కోసం దాదాపు అందరూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే వివిధ కారణాలతో చాలామందికి లబ్ధి చేకూరలేదు. వారంతా తమకూ పథకం వర్తింపజేయాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న సర్కారు.. దరఖాస్తుల స్వీకరణకు అనుమతించింది. ఈనెల 17 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. రేషన్‌కార్డు ఉండి 2 వందల యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అర్హులందరికీ జీరో బిల్లు..

జిల్లాలో గృహజ్యోతి అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. మార్చిలో 1.40 లక్షల కుటుంబాలకు జీరో బిల్లు రాగా.. ఆగస్టులో 1.57 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరింది. అర్హులైన అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నాం.

– రమేశ్‌బాబు, ఎస్ఈ, విద్యుత్ శాఖ

సంతోషంగా ఉంది



గతంలో ప్రతినెల నాలుగైదు వందల కరెంటు బిల్లు వచ్చేది. గృహజ్యోతి పథకం వచ్చిన తర్వాత మాకు మేలు జరిగింది. ఆ డబ్బులు ఇంటిలో ఏదో ఒక ఖర్చుకు ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం ఉచితంగా కరెంటు ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– కుమ్మరి రాములు, ఎల్లారెడ్డి

లబ్ధి పొందుతున్నాం



ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం బాగుంది. 2 వందల యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వాళ్లకు మేలు జరుగుతోంది. నాలుగైదు నెలలుగా మాకు జీరో బిల్లు వస్తోంది. ఈ పథకాన్ని కొనసాగించాలి.

– షేక్ హమీద్, పిట్లం

200 యూనిట్లలోపే వాడుతున్నా..



ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నాను. 200 యూనిట్లలోపే విద్యుత్ వాడుతున్నాం. కానీ మాకు జీరో బిల్లు రావడంలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. అందరికీ వర్తింపజేయాలి.

– గంగారాం, రాంపూర్, పిట్లం మండలం



తొలిపూజకు వేళాయె!

- ఊరూ, వాడా పండుగ సందడి
- నేడు వినాయక చవితి

తొలి పూజలు అందుకునేందుకు విఘ్నేశ్వరుడు సిద్ధమయ్యాడు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ శనివారం తమ ఇళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజాదులు నిర్వహించనున్నారు. గల్లీ గల్లీలో మండపాలను ఏర్పాటు చేశారు. నవరాత్రులు పూజలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. పండుగ నేపథ్యంలో శుక్రవారం మార్కెట్లలో సందడి నెలకొంది. - సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

'భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి'

కామారెడ్డి క్రైం: వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జనహిత గణేశ్ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రాజేశ్వర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, టీజీవో జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

'బీజేపీకి అన్ని వర్గాల మద్దతు'



పార్టీ నాయకులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: బీజేపీకి అన్ని వర్గాల మద్దతు లభిస్తోందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదుపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. బీజేపీ సిద్ధాంతం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. మైనారిటీలు కూడా బీజేపీకి మద్దతు పలుకుతున్నారని, వారి నుంచి పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని మించి సభ్యత్వాలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్, నాయకులు శ్రీకాంత్, వేణు, బాల్‌రాజు, భాస్కర్, వెంకటి, రాజశేఖర్‌రెడ్డి, ఆనందరావు, గంగారెడ్డి, నరేశ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

'గురుకులం'లో విద్యార్థుల మధ్య ఘర్షణ

- బ్యాట్లు, ఇనుప రాడ్లతో పరస్పర దాడులు
- 10 మందికి గాయాలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు రాత్రి సమయంలో మద్యం సేవించడం, పొగతాగడం చేస్తున్నారని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు అందింది. ఆయన విద్యార్థులను మందలించారు. దీంతో ఫిర్యాదు చేసినవారిపై కక్ష పెంచుకున్న సదరు విద్యార్థులు.. గురువారం అర్ధరాత్రి సమయంలో గొడవకు దిగారు. దీంతో ఇరు వర్గాలు బ్యాట్లు, ఇనుప మంచాలకు సంబంధించిన రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ విషయమై ఇతర విద్యార్థులు అదే రాత్రి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఇతర ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. వారు గురుకుల కళాశాలకు వెళ్లి విద్యార్థులను సముదాయించారు. దాడులలో గాయపడిన వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్, జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి

విచారణ చేపట్టిన అధికారులు

విద్యార్థుల మధ్య గొడవ జరిగిన విషయాన్ని తెలుసుకున్న గురుకులాల జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, సీఐ రవీందర్‌నాయక్ శుక్రవారం కళాశాలకు వచ్చి విచారణ జరిపారు. ఆర్డీవో, జోనల్ ఆఫీసర్ మాట్లాడుతూ రాత్రి సమయంలో విద్యార్థులతో కలిసి ఉండాల్సిన ఉపాధ్యాయుడు.. విద్యార్థులు పడుకోగానే ఇంటికి వెళ్లారని పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపి విద్యార్థులు ఇకపై ఇలాంటి గొడవలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, సీఐ రవీందర్‌నాయక్, ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు నేతకే పీసీసీ పీఠం

- బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించిన అధిష్టానం
- ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్
- డీఎస్ తర్వాత జిల్లా నుంచి రెండో వ్యక్తి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు జిల్లా నేతకు మరోసారి పీసీసీ పీఠం దక్కింది. ప్రస్తుతం పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ అధినాయకత్వం ఖరారు చేసింది. ఈ పీఠానికి సంబంధించిన అంశం గత కొన్ని నెలలుగా అనేక మలుపులు తిరుగుతూ వచ్చింది. చివరకు మహేశ్ కుమార్ గౌడ్ పేరును ప్రకటించారు. గతంలో జిల్లా నుంచి ధర్మపురి శ్రీనివాస్ రెండుసార్లు ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇప్పుడు మహేశ్‌గౌడ్ రెండో వ్యక్తి కావడం గమనార్హం. ఎన్ఎస్‌యూఐ నుంచి సుదీర్ఘ కాలం పాటు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ వచ్చిన మహేశ్‌గౌడ్‌కు పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా, అందరినీ కలుపుకునిపోయే నేతగా మంచి పేరుంది. మహేశ్‌గౌడ్ నియామకానికి సంబంధించి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ నేతకు అవకాశం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓసీ కావడంతో పీసీసీ పీఠం బీసీ నేతకు ఇచ్చేందుకు పార్టీ అగ్రనేతలు నిర్ణయించారు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ తెలంగాణ కావడంతో, పీసీసీ పీఠం ఉత్తర తెలంగాణకు కేటాయించారు. ఈ రెండు అంశాలు మహేశ్ గౌడ్‌కు కలిసి వచ్చాయి. కాగా పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఎస్టీ కోటా నుంచి మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎస్సీ కోటా నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీసీ కోటా నుంచి మాజీ ఎంపీ, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పోటీ పడ్డారు. తుది దశలో మహేశ్‌గౌడ్, మధుయాష్కీ గౌడ్ మధ్య గట్టి పోటీ కొనసాగింది. అయితే ఆర్గనైజేషన్ కార్యకలాపాల నిర్వహణలో ఆది నుంచి పనిచేస్తూ వస్తున్న మహేశ్‌గౌడ్ ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. ఇది మహేశ్‌కుమార్ గౌడ్‌కు కలిసి వచ్చింది. మహేశ్‌గౌడ్ సేవలను గుర్తించిన ఏఐసీసీ నాయకత్వం ఇప్పటికే ఎమ్మెల్సీ పదవి కేటాయించింది. నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు ఆశించినప్పటికీ షబ్బీర్ అలీ రావడంతో త్యాగం చేశారు. ఆ సమయంలో మహేశ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని పార్టీ అగ్రనేతలు హామీ ఇచ్చారు. అయితే మారిన సమీకరణాల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు కేబినెట్ పదవి బదులు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నేతకు పీసీసీ పీఠం దక్కడంతో రెండు జిల్లాల్లోని పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

తిరుగులేని నేత..

నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాల్లో ప్రచారం చేస్తున్న సమయంలో మహేశ్‌గౌడ్ అన్నీ తానై వ్యవహరించి పార్టీ ఆర్గనైజింగ్ కార్యకలాపాలను పకడ్బందీగా నిర్వహించారు. మరోవైపు సీనియర్ నేతల మధ్య సమన్వయం చేయడంలో మహేశ్‌గౌడ్ కీలక పాత్ర పోషించారు. ఈ పనితీరు సైతం మహేశ్‌గౌడ్‌కు కలిసి వచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డికి చాలావరకు భారం తగ్గించడంతో మహేశ్‌గౌడ్ విషయమై మొగ్గుచూపారు. మహేశ్‌గౌడ్‌కు పీసీసీ పీఠం దక్కేందుకు రేవంత్ తీవ్రంగా కృషి చేయడం గమనార్హం.

మొరాయించిన వరద గేటు

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు సింగూర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం 30 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ఐదు వరద గేట్లు ఎత్తి 36,500 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. కాగా వరద గేట్లు ఎత్తే సమయంలో 7వ నంబర్ గేటు మొరాయించింది. గేటు ఎత్తేందుకు ప్రయత్నించినా అతికష్టం మీద మూడు ఫీట్ల ఎత్తు మాత్రమే లేచింది. దీంతో అప్రమత్తమైన అధికారులు మరో గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. మొరాయించిన వరద గేటును కిందికి దింపడానికి ప్రయత్నించినా దిగడం లేదని తెలిసింది. ఇన్‌ఫ్లో ఆగిపోతే పరిస్థితి ఏమిటన్న విషయమై ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం రాత్రి వరకు 1,404.64 అడుగుల(17.282 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బియ్యం తరలింపుపై నిఘావర్గాల ఆరా..!

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డి : 'బియ్యం తరలింపులో ఇష్టారాజ్యం' అనే కథనం ప్రచురితం కావడంతో ఈ కథనంపై నిఘా వర్గాలు శుక్రవారం ఆరాతీసినట్లు సమాచారం. నిఘా వర్గాల అధికారులకు ఉన్నతాధికారుల నుంచి బియ్యం తరలింపుపై వచ్చిన కథనం ఆధారంగా సమగ్రంగా విచారణ నిర్వహించి నివేదిక పంపాలని ఆదేశాలు రావడంతో నిఘా వర్గాల అధికారులు గోదాంలో విచారణ నిర్వహించినట్లు సమాచారం. బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి పలువురు కాంట్రాక్టర్లు కూడా హైదరాబాద్‌లోని సివిల్ సప్లయ్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. బియ్యం తరలింపునకు సంబంధించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులతో పాటు కాంట్రాక్టర్‌పై కలెక్టర్ చర్యలు తీసుకునేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

శాబ్దిపూర్ ఎస్సీ కాలనీలో అంధకారం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం శాబ్దిపూర్ ఎస్సీ కాలనీ, బీడీ కాలనీ, న్యూ బీసీ కాలనీల్లో గత వారం రోజులుగా కరెంట్ లేక అందకారంలో ఉందని కాలనీవాసులు తెలిపారు. లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌లు ఎస్సీ కాలనీలో కొండ్లు పెట్టుకోవడం వల్ల కాలనీ మొత్తానికి కరెంట్ నిలిపివేశారని తెలిపారు. ఈ విషయమై గ్రామ సెక్రటరీకి, గ్రామ ప్రత్యేకాధికారి తహసీల్దార్ జనార్ధన్‌ల దృష్టికి తీసుకెళ్లిన లైన్ మెన్ రవి కరంట్ కట్ చేశాడని కాలనీవాసులు తెలిపారు.

బాన్సువాడలో సంబురాలు



బాన్సువాడ రూరల్ : పీసీసీ అధ్యక్షులుగా నిజామాబాద్‌కు చెందిన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఎంపిక కావడంపై శుక్రవారం రాత్రి బాన్సువాడలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

రెవెన్యూ రికార్డుల తనిఖీ



రాజంపేట : మండలంను శుక్రవారం ఆర్డీవో రంగనాథం సందర్శించి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. రుణమాఫీ ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గుండారంలో నూతనంగా పెట్రోల్ పంపు అనుమతులు కోసం దరఖాస్తు రాగా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్ఐ సంతోష్ సిబ్బంది పాల్గొన్నారు.







పట్టణంలో పండుగ సందడి




జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో పూలు, గణపతి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



జేపీఎన్ చౌరస్తాలో లడ్డూల విక్రయాలు

కామారెడ్డి టౌన్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం పండుగ సందడి నెలకొంది. పట్టణంలోని సుభాష్, జేపీఎస్, మాయాబజార్, సిరిసిల్లారోడ్, కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరాస్తలో వినాయక విగ్రహాల ప్రతిమలు, పూజాసామగ్రి, పండ్లు, పూల వ్యాపారాలు ప్రత్యేక స్టాళ్లతో జోరుగా సాగాయి. వివిధ రూపాల్లో తయారు చేసిన మట్టి, రంగురంగుల వినాయక ప్రతిమలు ఆకట్టుకున్నాయి. అలాగే ఏకదంతుడికి సమర్పించే లడ్డూలను చిన్న నుంచి భారీ సైజుల్లో తయారు చేసి తయారు చేసి వ్యాపారులు విక్రయించారు. గ్రామాల నుంచి మామిడిఆకులు, పూజకు కావాల్సిన పత్రి, ఎలక్కాయ, మొక్కజొన్న తదితర సామాగ్రి తీసుకొచ్చి విక్రయించారు. ఈ మేరకు పట్టణంలో రోడ్లన్నీ రద్దీగా మారాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లా కేంద్రంలో మండపాల్లో నవ రాత్రుల ఉత్సవాలతో పాటు చివరి రోజు వైభవంగా శోభాయాత్ర సాగుతుంది.

ఉత్తమ గురువులకు సన్మానం



ఎల్లారెడ్డిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో తదితరులు



చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో..



నిజాంసాగర్‌లో..

నియోజకవర్గంలో ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. రేపటి పౌరులను తయారుచేసే గురుతర బాధ్యత గురువులపైనే ఉందని వక్తలు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కామారెడ్డి మండలంలో..

హిందూ దేశంగా ప్రకటించాలి



కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్ : భారత దేశం హిందూ దేశం కావాలనే సంకల్పంతో తాను హరిద్వార్ నుంచి రామేశ్వరం వరకు గంగా జలాలతో యాత్ర కొనసాగిస్తున్నట్లు కవిసింగ్ అన్నారు. శుక్రవారం కవిసింగ్ తన యాత్రలో భాగంగా కామారెడ్డి పట్టణానికి చేరుకోగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందూవాహిని ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీసరస్వతి విద్యా మందిర్ హైస్కూల్ వద్ద చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, నగర అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి, కార్యదర్శి వంగ ప్రసాద్ తదితరులున్నారు.

'నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం'



కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. దాతల సహకారంతో జిల్లా కేంద్రం లోని ప్రధాన కూడళ్లు, వీధులలో ఏర్పాటు చేసిన 100 సీసీ కెమెరాలు, పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను ఎస్పీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని అశోక్ నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం, నిజాంసాగర్ రోడ్, అంబేద్కర్ విగ్రహం, స్టేషన్ రోడ్, ధర్మశాల, గంజ్ మార్కెట్, వీక్లీ మార్కెట్ వరకు నాలుగు కిలోమీటర్ల పరిధి మేర పని చేసేలా పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలిస్తూ మైక్ సెట్‌ల ద్వారా ప్రజలు, వాహనదారులకు సూచనలు ఇస్తామన్నారు. సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం మైక్‌లు ఏర్పాటుకు కృషి చేసిన పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు కమలాకర్‌రెడ్డి, విశ్వనాథ్, సిబ్బందిని అభినందించారు. ఏఎస్పీ నర్సింహారెడి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన

కామారెడ్డి అర్బన్: జిల్లాస్థాయి ఉత్తమ టీచర్‌గా అవార్డు అందుకున్న గండి మాసానిపేట్ టీచర్ వెంకటరమణను శుక్రవారం కామారెడ్డి రక్తదాతల సమూహం సన్మానించింది. మూణ్నెళ్లకొకసారి ఒకసారి రక్తదానం చేసే వెంకటరమణ విద్యాబోధనలోనూ ముందుండడం గర్వకారణమని రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్ అభినందించారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామంలో ఓ యువకుడు శుక్రవారం అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని చాకలి లక్ష్మణ్(39) అనే యువకుడు గత కొన్ని రోజులుగా టెంట్ హౌజ్‌నడుపుతు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పుల పాలై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబీకుల ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపం లోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా లోని వేల్పూర్ గ్రామానికి చెందిన రాజారపు చందు, నవ్యలు బైక్‌పై అంకాపూర్ వైపు వెళ్తుండగా కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా పోలీసులు కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు రనిఫర్ చేశారు. దేవునిపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

వర్ని: మండలంలోని అఫంది ఫారంలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందింది. శుక్రవారం తెల్లవారుజామున దానావత్ హరిసింగ్‌కు చెందిన పశువుల కొట్టంలో ఉన్న లేగదూడపై చిరుత దాని పిల్లలు రెండు దాడి చేసి చంపినట్లు వర్ని అటవీ రేంజ్ అధికారి సంజీవ్‌గౌడ్ వెల్లడించారు. వాటి కాళ్ల గుర్తుల ఆధారంగా అవి దాడికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. చందూర్, జలాల్‌పూర్, హుమ్నాపూర్, అక్బర్‌నగర్, మోస్రా అటవీ ప్రాంతాల్లో చిరుతలతో పాటు వన్యప్రాణులు సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని పేర్కొన్నారు.

హాజీపూర్‌లో చిరుత సంచారం!



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని హాజీపూర్ శివారులో చిరుత సంచరిస్తోందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తండా శివారులో చిరుత పాద ముద్రలు కనబడడంతో తండావాసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వాటిని పరిశీలించిన అధికారులు అవి చిరుత పాదముద్రలు కావని, అడవిపిల్లికి సంబంధించినవని పేర్కొన్నారు.

నడిరోడ్డులో వదిన హత్య

- దారుణానికి ఒడిగట్టిన మరిది
- తండ్రి వైద్య ఖర్చుల విషయంలో అన్నదమ్ముల కుటుంబాల్లో వివాదం
- చిచ్చురేపిన భూతగాదం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల ఆందోళన



లావణ్య (ఫైల్)



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

భిక్కనూరు: భూతగాదాలతో పాటు తండ్రి ఆస్పత్రి ఖర్చుల విషయంలో వదినను మరిది నడి రోడ్డుపై కత్తితో హత్య చేసిన ఘటన భిక్కనూరు మండలంలోని బాగిర్తిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మంద పోచయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాములు, చిన్నకుమారుడు సురేష్ ఉన్నారు. పోచయ్య పేరిట గ్రామంలో నాలుగు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. కొన్ని రోజులుగా పోచయ్య తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఇద్దరు కుమారులు ఆస్పత్రి ఖర్చులను భరిస్తున్నారు. ప్రతి రోజు ఆస్పత్రి ఖర్చులు ఎక్కువ కావడంతో తండ్రి పేరిట ఉన్న భూమిలో కొంత భాగాన్ని అమ్మి తండ్రికి వైద్యం చేయిద్దామని సురేష్ తన అన్న, వదినతో చెప్పాడు. దీనికి రాములు భార్య లావణ్య(49) వ్యతిరేకించింది. దీంతో కొన్ని రోజులుగా వీరి మధ్య తగాదాలు నెలకొన్నాయి. శుక్రవారం లావణ్య తన ఇంటి ఎదుట వంట పాత్రలను శుభ్రం చేస్తుండగా రెండు కుటుంబాల మధ్య మళ్లీ గొడవ మొదలైంది. కోపంతో సురేశ్ ఇంట్లో ఉన్న కత్తి తెచ్చి వదినపై దాడి చేశాడు. ఆమె కేకలు వేస్తూ రోడ్డుపై పరుగెత్తింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన రాములు కుమారుడు జశ్వంత్‌ను సైతం హత్య చేసేందుకు సురేష్ యత్నించగా వెంటనే జశ్వంత్ తండ్రి రాములు వద్దకు వచ్చి విషయాన్ని చెప్పాడు. వెంటనే ఇంటి నుంచి రాములు చుట్టుపక్కల వారు రోడ్డు మీదికి వస్తుండగానే సురేష్ లావణ్యపై దాడిచేసి హత్యచేసి పారిపోయాడు. ఈ విష యాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించేందుకు యత్నించగా గ్రామస్తులు, మృతురాలి బంధువులు అడ్డుకున్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని కదలనీయమని మొండికేశారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు దోమకొండ, మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట ఎస్సైలు ఆంజనేయులు, అనిల్, నరేశ్, పుష్పరాజు సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. చివరకు మృతురాలి కుమారుడు జశ్వంత్ పేరిట భూమిని మార్చడానికి పోచయ్య సమ్మతిస్తూ బాండ్ పేపర్‌పై రాసి ఇవ్వడంతో ఉద్రిక్తత తగ్గింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు జశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సురేష్ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ పేర్కొన్నారు.

డెంగీతో కేజీబీవీ విద్యార్థిని మృతి



సిద్ధేశ్వరి (ఫైల్)

బిచ్కుంద: మండలంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని చాప్ల సిద్ధేశ్వరి డెంగీతో గురువారం రాత్రి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సంతోష్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె అయిన సిద్ధేశ్వరి కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. జూలై 18న అనారోగ్యానికి సిద్ధేశ్వరికి వైద్యులు పరీక్షలు చేయగా డెంగీగా నిర్ధారించి చికిత్సలు చేపట్టారు. కొన్ని రోజులకు తగ్గడంతో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్నది. పాఠశాలల్లో తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో ఉపాధ్యాయులు తల్లితండ్రులకు సమాచారం అందించారు. వారు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. కాగా విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు కేజీబీవీలో మౌనం పాటించి నివాళులు అర్పించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



శిరీష (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని కీమ్యానాయక్ తండాలో శిరీష (21)అనే వివాహిత ఉరేసుకొని అనుమానాస్పదస్థితిలో శుక్రవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన నరేశ్‌తో లింగంపేట్ మండలం పరుమళ్లతండాకు చెందిన శిరీషకు ఐదు నెలల క్రితం వివాహమైంది. శుక్రవారం ఉదయం శిరీష అనుమానాస్పదస్థితిలో ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న శిరీష తల్లితండ్రులు, బంధువులు కీమ్యానాయక్ తండాకు చేరుకొని మృతిపై ఆరాతీశారు. భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం వేధించి చంపేశారని ఆరోపిస్తూ నరేష్ ఇంటితో పాటు సమీప బంధువులకు చెందిన నాలుగు ఇండ్లపై దాడిచేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు సత్యనారాయణ, శ్రీనివాస్, బాన్సువాడ రూరల్, బిచ్కుంద సీఐలు సత్యనారాయణగౌడ్, నరేశ్, బాన్సువాడ ఎస్‌హెచ్‌వో కృష్ణ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించగా వారు వినలేదు. దీంతో పోలీసులు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ విషయమై బాన్సువాడ సీఐ కృష్ణను ఫోన్‌లో వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

నిందితుడి రిమాండ్

రామారెడ్డి: మండల కేంద్రంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్ శుక్రవారం తెలిపారు. రామారెడ్డి గ్రామానికి కొట్టె నర్సింలు తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 31న ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లగా నిందితుడు చోరీకి పాల్పడ్డాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు కత్రోత్ మహిపాల్‌గా పోలీసులు గుర్తించారు. వెంటనే అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు పరిష్కారానికి ఏఎస్సై లచ్చిరాం, హెడ్ కానిస్టేబుల్ దేవగౌడ్, కానిస్టేబుల్ సాయిలు, పవన్, రమేశ్ ఎంతో కృషి చేశారని తెలిపారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



కామారెడ్డి టౌన్ : గౌడ కులస్తులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ కులస్తులు రాజకీయంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్వాగౌడ్, మోహర్‌బాబా, పోచాగౌడ్, వెంకట్ రాజం, భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బోర్లంలో విద్యుత్ అధికారుల పర్యటన



బాన్సువాడ రూరల్ : తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న బీపీఎల్ కుటుంబాలకు రూ.938కే విద్యుత్ కనెక్షన్ మీటర్ ఇస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఆయన బాన్సువాడ రూరల్ ఏఈ అనిల్‌కుమార్, ఏడీఏ నాందేవ్‌లతో కలిసి బోర్లం గ్రామంలో పర్యటించారు. విద్యుత్ కనెక్షన్ లేనివారిని గుర్తించి విద్యుత్‌శాఖ తీసుకువచ్చిన 550 వాట్స్ మీటర్ గురించి వివరించారు. కొత్త వినియోగదారులు డిసెంబర్‌లో ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తుచేసుకోవాలని సూచించారు.

వరిలో ఎండాకు తెగులు వ్యాప్తిని అరికట్టాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా ప్రస్తుతం వరిపంటలో ఎండాకు తెగులు వస్తుందని, ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేదని, కాని తెగులు వ్యాప్తిని అరికట్టేందుకు రైతులు కృషి చేయాలని నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఏరువాకకేంద్రం కో–ఆర్డినేటర్ అనిల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పోచారంశివారులో వరిపంటలను శుక్రవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్ నాదన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. దీంతోపాటు తొలిదశలో తెగులు ఉన్న పంటలో 400గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, 60గ్రాముల స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్‌ను 200లీటర్ నీటిలో కలిపి ఎకరం పంటపై పిచికారి చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరం పంటపై 15–20 కిలోల పోటాష్ ఎరువును వేసుకోవాలన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్

మోర్తాడ్: ఏర్గట్ల పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఓ చైన్ స్నాచర్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం భీమ్‌గల్ సీఐ నరేశ్ కుమార్ మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానస్పద స్థితిలో కనిపించిన మెండోరా మండలం దూద్‌గాంకు చెందిన చవాన్ కిరణ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాలు నేరాలకు పాల్పడినట్లు తెలిపాడు. విలాసాలకు అలవాటు పడిన చరణ్‌సింగ్ మోర్తాడ్, మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల మండలాల్లో నాలుగు నేరాలకు పాల్పడినట్లు గుర్తించామని వెల్లడించారు. నిందితుని నుంచి పల్సర్ బైక్, ఫోన్, మూడు తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చైన్‌స్నాచర్‌ను చాకచక్యంగా పట్టుకున్న ఏర్గట్ల ఎస్సై రాము, కానిస్టేబుళ్లు వినయ్, శ్రీధర్, నవీన్‌చంద్రను సీఐ అభినందించారు.

మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్

- కేసు నమోదు, మూడు రోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఓ వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మగుట్టకు చెందిన మహమ్మద్ అఫ్రోజ్ కొన్ని రోజులుగా మద్యం సేవించిన ప్రతి సారి డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి అతనికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీబీపేటలో ముగ్గురి బైండోవర్

బీబీపేట: మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మండలంలోని జనగామ గ్రామానికి చెందిన పరుశరాం, శేరిబీబీపేటకు చెందిన దావూద్, బీబీపేటకు చెందిన శ్రీనివాస్ అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించి డయల్ 100కు ఫోన్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.